రేపు బార్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు పరిధిలో నిర్వహించే ఆటల పోటీల నిర్వహణకు సంబంధించి ఈనెల 27న జిల్లా బార్ అసోసియేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులకు మానసిక ఉల్లాసాన్ని అందించేందుకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొని తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

కిలో టమాటా రూ.50

- రైతుబజారులో విక్రయ కేంద్రం ప్రారంభం
- త్వరలో అన్ని పట్టణాల్లో విక్రయ కేంద్రాలు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా ప్రజల సౌకర్యార్థం కిలో టమాటాను సబ్సిడీపై రూ.50కే లభ్యమయ్యేలా విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. స్థానిక రైతుబజారులో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏర్పాటు చేసిన సబ్సిడీపై టమాటా విక్రయ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. కొనుగోలుదారులకు టమాటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలుగా దేశవ్యాప్తంగా టమాటా ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.120కు చేరుకుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యాన చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమాటాలను సేకరించి సబ్సిడీపై విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తొలివిడతగా జిల్లాకు ఐదు వేల టన్నుల టమాటాలను దిగుమతి చేసుకున్నామని, వీటిని పట్టణ ప్రజల సౌకర్యార్థం అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలందరికీ లభ్యమయ్యేలా ఒకరికి కేజీ మాత్రమే కొనుగోలు చేసుకునేలా పరిమితి విధించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లాకు మరిన్ని టమాటా లోడులను దిగుమతి చేసుకొని ప్రజలకు లభ్యమయ్యేలా చూస్తామన్నారు. సబ్సిడీ సౌకర్యాన్ని పట్టణ ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఇటువంటి కేంద్రాల ద్వారా బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. త్వరలో ఆమదాలవలస, పలాస ఇతర పట్టణాల్లో విక్రయ కేంద్రాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతుబజారులో మురుగునీటి కాలువలు, వర్షపు నీటి సమస్యల వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని శాశ్వత లేదా తాత్కాలిక ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఎం.కాళేశ్వరరావు, రైతుబజారు ఎస్టేట్ అధికారి రాజశేఖర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టమాటాలను అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రేపు రిక్షా పుల్లర్స్ మహాజన సభ

శ్రీకాకుళం : రిక్షా పుల్లర్స్ మహాజన సభ కార్యక్రమాన్ని ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు 52వ ఇన్‌స్పెక్షన్ అధికారి నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. ఈ నివేదికలోని అంశాలను చర్చించేందుకు, ప్రజాభిప్రాయ సేకరణ కోసం 27న ఉదయం 11 గంటలకు డివిజనల్ సహకార అధికారి కార్యాలయ ఆవరణలో మహాజన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాజన సభకు రిక్షా పుల్లర్స్ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పరిహారం చెల్లింపులు ఎప్పుడో?

- గతేడాది జూన్ 6న నిధుల విడుదల ఉత్తర్వులు
- నేటికీ వేలాది మందికి జమ కాని సొమ్ములు
- జిల్లాలో రూ.68.12 కోట్లు పెండింగ్
- డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

వంశధార నిర్వాసితులకు ఎక్స్‌గ్రేషియో చెల్లింపుల్లో ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తోంది. పరిహారం చెల్లింపులపై ఉత్తర్వులు వెలువరించి ఏడాది దాటినా, వేలాది మందికి నేటికీ డబ్బులు జమ కాలేదు. వంశధార ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి ఎకరాకు రూ.లక్ష చెల్లించనున్నట్లు తెలిపింది. పిడిఎఫ్ కుటుంబానికి రూ.లక్ష, యూత్ ప్యాకేజీ కింద రూ.లక్ష ఇవ్వనున్నట్లు తెలిపింది. అందులో కొందరికి డబ్బులు వచ్చినా, మరికొంత మందికి పరిహారం సొమ్ము ముట్టలేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నిర్వాసితులకు భూసేకరణ చట్టం 2013 అమలు హామీని నెరవేర్చని ప్రభుత్వం, చివరకు ఎక్స్‌గ్రేషియో చెల్లింపులోనూ మాట తప్పింది. గతేడాది జూన్ ఆరో తేదీన జిఒ నంబరు 1632 విడుదల చేసి, రూ.216.71 కోట్లను విడుదల చేసింది. ఇందులో భూములకు ఎక్స్‌గ్రేషియో కింద 15,571 మంది రైతులకు 9,580 ఎకరాల కోసం రూ.95.80 కోట్లు ఇవ్వాల్సి ఉంది. 7,103 పిడిఎఫ్ కుటుంబాలు, 4,988 మందికి యూత్ ప్యాకేజీలు కలిపి మొత్తం 12091 మందికి రూ.120.91 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు భూములకు సంబంధించి 12,291 మంది రైతులకు 6048 ఎకరాలకు గానూ రూ.60.48 కోట్లు ఇచ్చారు. ఇంకా 3,280 మంది రైతులకు 3,532 ఎకరాలకు రూ.35.32 కోట్లు పెండింగ్‌లో ఉంది. పిడిఎఫ్, యూత్ ప్యాకేజీల కోసం ఇప్పటివరకు 8,811 మందికి రూ.88.11 కోట్లు చెల్లించారు. పిడిఎఫ్ కుటుంబాల్లో 3,280 మందికి రూ.32.80 కోట్లు ఇవ్వాల్సి ఉంది. నిర్వాసితులకు మొత్తం మీద రూ.216.71 కోట్లకు గానూ రూ.148.59 కోట్లు చెల్లించింది. ఇంకా రూ.68.12 కోట్ల బకాయిలు ఉన్నాయి.

నిధులు విడుదల చేయకపోవడం వల్లే

నిర్వాసితులకు ఎక్స్‌గ్రేషియో చెల్లింపులో ప్రభుత్వం మభ్యపెడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు డబ్బులు రాలేదని అడుగుతున్న నిర్వాసితులకు, రిజర్వు బ్యాంకుకు డబ్బులు వివరాలు పంపామని త్వరలోనే మీ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయంటూ రెవెన్యూ అధికారులు బదులిస్తున్నారు. వలస వెళ్లిన కుటుంబాల చిరునామాలు తెలియకే డబ్బులు వేయలేకపోయామంటూ వారి బంధువులకు చెప్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

అదనపు పరిహారం కోసం కొత్తూరులో బైక్ ర్యాలీ చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

తిరిగి తిరిగి విసిగిపోయాం



మా కుటుంబంలో నలుగురికి అదనపు పరిహారం డబ్బులు రాలేదు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూములకు పరిహారంగా రూ.ఐదు లక్షల పైన రావాల్సి ఉండగా, రూ.లక్ష మాత్రమే వచ్చింది. కలెక్టరేట్‌కు ఎన్నిసార్లు వెళ్లామో తెలియదు. స్పందనలోనూ వినతిపత్రాలు ఇచ్చాం. జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేస్తే, ఆర్‌బిఐలో పెండింగ్ ఉందని బదులిచ్చారు. అసలు డబ్బులు వస్తాయో లేదో తెలియడం లేదు.

- గొట్టా గోవిందరావు, మెట్టూరు బిట్-3

అప్పుల పాలయ్యాం

మా ఇద్దరి అబ్బాయిల్లో ఒకరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వస్తే, ఒకరికి ప్యాకేజీ, భూమి రెండింటికీ డబ్బులు రాలేదు. నాకున్న 2.40 ఎకరాల భూమికి రావాల్సిన సొమ్మూ ఇవ్వలేదు. కలెక్టరేట్‌కు ఎన్నిసార్లు తిరిగానో లెక్కలేదు. రేపుమాపు అంటున్నారు. డబ్బులు ఇస్తారని అయిన కాడికి అప్పులు చేసి తీర్చలేక అప్పులపాలయ్యాం.

- గులివిందల ప్రమీల, మెట్టూరు బిట్-3

అదనపు పరిహారం చెల్లింపులకు చర్యలు చేపట్టాలి

వంశధార నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు ప్యాకేజీ డబ్బులను సకాలంలో చెల్లించడంలో విఫలమైంది. నిర్వాసితులకు సంబంధించి యూత్ ప్యాకేజీ, అర్హులైన వారసులకు ఇళ్లస్థలాలు, డి-పట్టా భూములకు చెల్లింపులు వంటి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యల పరిష్కారంతో పాటు నిర్వాసితులకు ఇవ్వాల్సిన అదనపు పరిహారం డబ్బులను వెంటనే చెల్లించాలి.

- గంగరాపు సింహాచలం, నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

మినీ ఖాదీ క్లస్టర్లతో నేతన్నకు చేయూత

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

మినీ ఖాదీ క్లస్టర్ ఏర్పాటు ద్వారా నేతన్నకు చేయూత అందిస్తామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శ్రీ సీతారామ స్వామి చేనేత సహకార సంఘం కామన్ ఫెసిలిటీ సెంటర్‌కు తొలి విడతలో మంజూరైన రూ.73 లక్షల విలువ గల చేనేత మగ్గాలు, ఇతర పరికరాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్లస్టర్ యూనిట్‌కు సుదీర్ఘమైన చరిత్ర ఉందన్నారు. మినీ ఖాదీ క్లస్టర్ ఏర్పాటు ద్వారా నేతన్నకు ఆధునిక పద్ధతుల్లో వస్త్రాల నేత అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇక్కడ నేసిన ఖాదీ వస్త్రాలు నాణ్యతతో కూడి మన్నిక కలిగి వినియోగదారుల అభిమానాన్ని చూరగొందన్నారు. కుల వృత్తులు అంతరించకుండా ఉండేందుకు ప్రభుత్వం వారిని ప్రోత్సహించేలా పలు చర్యలకు ఉపక్రమించిందని చెప్పారు. దేశంలోనే పొందూరు ఖాదీకి ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. త్వరలోనే పొందూరు ఖాదీకి పేటెంట్ హక్కులు రామన్నాయని తెలిపారు. నియోజకవర్గంలో మినీ ఖాదీ క్లస్టర్లను అవసరమయ్యే చోట ఏర్పాటు చేసేందుకు చేనేత జౌళి శాఖ ప్రతిపాదనలు చేయగా, అవి మంజూరయ్యాయన్నారు. ఒక్కో మినీ క్లస్టర్‌కు రూ.రెండు కోట్ల పెట్టుబడి అవసరం కాగా, కేంద్ర ప్రభుత్వం 90 శాతం సహాయం అందిస్తుందని, లబ్ధిదారులు 10 శాతం మాత్రమే వాటాగా పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. మినీ క్లస్టర్ ప్రాజెక్టు వల్ల చేనేత కార్మికులకు చేనేత, డయింగ్, డిజైనింగ్, ఐటి, మేనేజీరియల్ రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ లభించనుందని తెలిపారు. శిక్షణా కాలంలో రోజుకు రూ.300 స్టైఫండ్ అందించనున్నట్లు చెప్పారు. 'సమర్థ' పథకం కింద నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల మగ్గాలు, ఆధునిక పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో డిఇ ధర్మారావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సచివాలయం కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, దన్నాన సత్యనారాయణ, జి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మగ్గం నేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ధర్నా చేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కరువైందని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజు అన్నారు. మణిపూర్‌లో ఘటనలకు బాధ్యులను శిక్షించాలని, శాంతిని నెలకొల్పాలని శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులు అత్యంత హేయమైనవన్నారు. మూడు నెలలుగా అక్కడ ఘర్షణలు జరుగుతున్నా, వాటిని నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళపై దాడి జరిగిన మరుసటి రోజే డేరాబాబా, బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు బెయిల్ ఇచ్చి ఊరట కల్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. నిత్యం దేశభక్తి జపం చేస్తున్న బిజెపి ప్రభుత్వం, మహిళలపై జరుగుతున్న దాడులపై మాట్లాడడం లేదని విమర్శించారు. ప్రపంచ దేశాలు మణిపూర్ ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నా, బిజెపి మహిళా ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, నాయకులు ఎం.లలిత, స్వర్ణ, స్వాతి, పావని, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల కొవ్వొత్తుల ర్యాలీ

మణిపూర్‌లో మారణకాండను అరికట్టాలని, మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలని కోరుతూ ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం మాట్లాడుతూ 80 రోజులుగా విధ్వంసాలు, మారణకాండతో మణిపూర్ ప్రజలు భయాందోళనలతో కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగికంగా దాడి చేసి కొట్టి చంపిన దుండగులను శిక్షించడంలో కేంద్ర, రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. కుకీ తెగకు చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించడంతో పాటు వారి కుటుంబాలను హతమారుస్తున్నా చలనం లేకపోవడం దారుణమన్నారు. మణిపూర్ ఘటనలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మత ఘర్షణలు, దళితులపై, మైనార్టీలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో ఎ.గణేష్, ఎ.శంకర్, డి.గణేష్, ఎ.లక్ష్మి, ఇ.గంగ, ఎ.ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో నిర్లక్ష్యం

- ప్రభుత్వానికి అనుకూలంగా కలెక్టర్
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలనలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ఇంత నిర్లక్ష్యమేమిటని ప్రశ్నించారు. సిఎం జగన్ ఆదేశాల మేరకు ఐప్యాక్‌కు సమాచారం అందించేలా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనా సరళిని విస్మరించి కలెక్టర్ వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమేనన్నారు. కలెక్టర్ ఇదే నిర్లక్ష్యంతో, పక్షపాత ధోరణితో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఓటర్ల జాబితా పరిశీలన ప్రారంభించని తహశీల్దార్లు, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తూతూమంత్రంగా అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో నెలనెలా కంటితుడుపు సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప వాటి ఫలితాలు మాత్రం రావడం లేదన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐప్యాక్, ఇతర వ్యవస్థల ద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ 10 నుంచి 20 వేల బోగస్ ఓటర్లను నమోదు చేసి వైసిపి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఐదు నుంచి 30 వరకు బోగస్ ఓట్లను నమోదు చేయించిందన్నారు. ఎన్నికల కమిషన్ ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓట్ల నమోదులో లోపాలను గుర్తించి, క్షేత్రస్థాయిలో బిఎల్‌ఒల ద్వారా ఇంటింటికీ వెళ్లి జాబితాలను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈనెల 21 నాటికే ఈ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా, ఇప్పటివరకు 70 నుంచి 80 శాతం జిల్లాలో ప్రారంభం కాలేదన్నారు. ఇది జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. వాలంటీర్లు ప్రజల, మహిళల వ్యక్తిగత సమాచారాన్ని చోరీకి పాల్పడి ఐప్యాక్ టీమ్‌కు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాయకులు సింతు సుధాకర్, ప్రధాన విజయరాం, బొనిగి భాస్కరరావు, కె.వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా టెక్కలి డిఎస్‌పి కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా పోలీసుల గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. గంజాయి, గుట్కా, ఖైనీ తదితర నిషేధిత పదార్థాల రవాణా, విక్రయాలపై దృష్టిసారించాలన్నారు. పాత కేసుల్లో ముద్దాయిలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నేర నియంత్రణ నిరంతర గస్తీ నిర్వహించాలన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి, సిఐ సూర్య చంద్రమౌళి, ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

అప్పలరాజుది అధికార దుర్వినియోగం

- తన కంపెనీ మందులు కొనాలని బెదిరింపులు
- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపణ

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. విశాఖలో హార్క్ లైఫ్ సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్ మందుల కంపెనీని ఏర్పాటు చేసి, ఆ కంపెనీ మందులనే కొనుగోలు చేయాలని ఉత్తరాంధ్ర పరిధిలోని వైద్యులు, మందుల దుకాణాల యజమానులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ కంపెనీలో వాటా లేదని మంత్రి చెప్పగలరా అని ప్రశ్నించారు. పలాసలో భూ కబ్జాలపై పత్రికలో వుంఖానువుంఖాలుగా కథనాలు వస్తున్నా, మంత్రికి చీమ కుట్టినట్లు లేదని విమర్శించారు. భూ కబ్జాలపై జాయింట్ కలెక్టర్ సమక్షంలో దర్బార్ నిర్వహించారని, అందులో వచ్చిన ఫిర్యాదుల్లో ఒక్కటైనా పరిష్కరించగలిగారా అని ప్రశ్నించారు. శవ రాజకీయాలు చేయడంలో మంత్రి దిట్ట అని, ఇటీవల సూదికొండకు చెందిన మహిళ పలు కారణాలతో ఆత్మహత్య చేసుకుంటే, ఆ వార్డు కౌన్సిలర్ భర్తపై కేసు పెట్టాలని మృతురాలి తండ్రిపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. మద్దతు ధర లేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి మాకన్నపల్లి జీడి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంత్రికి కనిపించదా అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, పట్టణాధ్యక్షులు నాగరాజు, టంకాల రవి శంకర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

పనులు వేగవంతం కావాలి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఆదేశించారు. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాలను సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనకుమారితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. సెప్టెంబర్ 15 నాటికి భవన నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సంబంధిత ఇంజినీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ శ్రీనివాసరావు, డిఇఇలు సిమ్మన్న, సింహాచలం, ఎఇ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కాంతిలాల్ దండే

కొనసాగుతున్న కౌన్సెలింగ్

ఎచ్చెర్ల : స్థానిక ట్రిపుల్ ఐటిలో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ రెండో రోజు మంగళవారం కొనసాగింది. మొత్తం 1086 మందికి గానూ 900 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కౌన్సెలింగ్ కోసం 30 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా, వంద మంది బోధన, బోధనేతర సిబ్బంది ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎల్.డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ, కౌన్సెలింగ్ కన్వీనర్ ఎస్.ఎస్‌వి. గోపాలరాజు, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ పి.గోవర్ధనరావు ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

అధిక ఫీజుల నియంత్రణ, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, విద్యా, వసతి దీవెన డబ్బులు జమ తదితర డిమాండ్లతో టిఎన్ఎస్ఎఫ్ పిలుపు మేరకు మంగళవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష ఆధ్వర్యాన టిఎన్ఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ (ఆలిండియా యూత్ ఫెడరేషన్) నాయకులు శ్రీకాకుళం నగరంలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలను మూయించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలలు యదావిధిగా పనిచేశాయి. విద్యార్థి సంఘ నాయకులు వస్తారనే సమాచారంతో పోలీసులు వారిని అరెస్టు చేసేందుకు వాహనాలను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న నాయకులు కళాశాల బంద్ ప్రయత్నాలను విరమించుకుని వెనక్కి వెళ్లిపోయారు. బంద్ పిలుపుతో కొన్ని విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి. పలాసలో టిఎన్ఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు జంట పట్టణాల్లో పాఠశాలలు, కళాశాలలను మూసివేయించారు.

అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి

విద్యారంగంలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష డిమాండ్ చేశారు. షరతు లేకుండా అమ్మఒడి పథకాన్ని కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమంది విద్యార్థులకు ఇవ్వాలన్నారు. నూతన విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రయివేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలన్నారు. వసతి గృహ విద్యార్థులకు పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రెడ్డి శంకర్, జి.వాసుదేవరావు, ఎఐవైఎఫ్ నాయకులు శ్రీను, రవి, ఎఐఎస్ఎఫ్ నాయకులు సిహెచ్.రవి, పవన్, చందు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌తో స్కూల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు

స్పీకర్‌కు సమస్యల వెల్లువ

ప్రజాశక్తి- బూర్జ

జగనన్న ఇళ్ల నిర్మాణ బిల్లులు చెల్లించకపోవడంతో వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వద్ద వాపోయారు. మండలంలోని తోటవాడలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో సమస్యలు వెల్లువెత్తాయి. అలాగే వీధుల్లో కాలువలు ఏర్పాటు చేయాలని, కొంతమంది అమ్మఒడి పథకం తమ ఖాతాలో జమ కాలేదని మొరపెట్టుకున్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ... అమ్మఒడి పథకం అర్హులైన ప్రతిఒక్కరికీ ఒకటి రెండు రోజుల్లో మీ ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. జగన్న ఇళ్ల బిల్లులు కూడా త్వరలో జమవుతాయని అన్నారు. అలాగే కాలువల నిర్మాణలకు ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్ సూర ఆనందరావు, అధికారులు పాల్గొన్నారు.

టెక్కలి : సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి

ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటులు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండే విధంగా చూడాలని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి బిఎల్‌ఒలకు ఆదేశించారు. శ్రీనివాసనగర్‌లో చేపడుతున్న ఓటరు సర్వేను మంగళవారం పరిశీలించారు. ప్రతిఒక్కరూ తమ ఓటరు కార్డును తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. ఈయనతో పాటు తహశీల్దార్ కురమాన ప్రవల్లికాప్రియ, ఎన్నికల డిటి అనిల్, సీనియర్ అసిస్టెంట్ విజయ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బూర్జ: ఓటరు నమోదులో, సవరణలో, సర్వేలో ఏ మాత్రం అవకతవకలు జరిగినట్లయితే చర్యలు తప్పవని ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి బిఎల్‌ఒలకు హెచ్చరించారు. మండలంలోని ఉప్పినివలస, ఎబిసి పేట గ్రామాల్లో చేపడుతున్న ఓటర్ల సర్వేను మంగళవారం పరిశీలించారు. ముందుగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఓటర్ల సర్వే ప్రక్రియ ఏ విధంగా నిర్వహిస్తున్నారని నేరుగా వెళ్లి పరిశీలించారు. ఉప్పినవలస సచివాలయానికి వెళ్లి కంప్యూటర్‌లో సర్వేలను, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం భూ సర్వే ఏ విధంగా జరుగుతుంది, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని తహశీల్దార్ ఎన్.రమణారావును అడిగి తెలుసుకున్నారు. భూ రీ సర్వేను వేగవంతం చేసి రైతులకు సంబంధిత పత్రాలను అందించాలని ఆదేశించారు. ఈమెతో పాటు డిటి సంతోష్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ సూర్యారావు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పెద్దపద్మాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు పంపిణీతో పాటు సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకం అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, మండల కన్వీనర్ పల్లి యోగి, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎం.పద్మనాభం, మండల ఎఒ దానకర్ణుడు, ఎపిఎం లలిత పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని సోమరాజపురంలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, వైస్ ఎంపిపి మెండ సుమతి, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి కృష్ణారావు, వైసిపి నాయకులు గండివలస ఆనందరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, బి.శ్రీను, సర్పంచ్ పి.సాధుబాబు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని తిమడాం, శ్రీముఖలింగం సచివాలయాల్లో ఎంపిపి వాన గోపి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. శ్రీముఖలింగంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్‌లో భాగంగా చేపడుతున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం మండల వైసిపి కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, ఇఒపిఆర్‌డి పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : జగనన్న సురక్షతో ప్రజలకు మేలు చేకూరుతుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాతటెక్కలి సచివాలయం ఆవరణలో సర్పంచ్ తుంగాన సుశీల, ఎంపిటిసి బాలల శ్రీను ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, నాయకులు దాలయ్య, జోగారావు, చింత హేమారావు, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, డిటి గిరిరాజు పాల్గొన్నారు.

కొత్తూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సదస్సును విజయవంతం చేయాలి

పలాస : కిసాన్ సంయుక్త మోర్చా, ట్రేడ్ యూనియన్‌ల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన విజయవాడలో ఈ నెల 30న జరగనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు పిలుపు నిచ్చారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్ ఆవరణలో మంగళవారం సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాల వల్ల రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే చట్టాలు చేశారని గుర్తు చేశారు. కానీ రద్దు చేసిన సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. హామీలు అమలు కోసం కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాన్ని సాగించేందుకు సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులో రైతులు, రైతు కూలీలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలిండియా రూరల్ లేబర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎఐకెఎంఎస్ నాయకులు ఎం.వినోద్‌కుమార్, ఎపి రైతు సంఘం నాయకులు సిహెచ్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండిలో విజయవాడలో నిర్వహించనున్న సదస్సు పోస్టర్‌ను రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.భాస్కరరావు, కె.బాలాజీరావు, ఎం.గణేష్, రైతు సంఘం నాయకులు కె.హేమసూదన్, శంకరరావు, కె.శశి, ఆర్.నీలాచలం, కార్మిక సంఘం నాయకులు కె.వెంకటరాఉవ, కె.అప్పారావు, ఎన్.సింహాచలం, మల్లయ్యలు ఆవిష్కరించారు.

రోడ్డుకు గండి

మెళియాపుట్టి : మండలంలోని గొడ్డ-ఆంపురం రహదారిలో అనంతగిరి సమీపం వద్ద పెద్ద గుంత ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలాల మీదుగా నీరు ఎక్కువగా ప్రవహించడంతో ఈ గండి ఏర్పడింది. అసలే ఇరుకు రోడ్డు, ఆపై పడుతున్న వర్షాలకు రోడ్డు కోతకు గురవుతుంది. దీంతో ఈ ప్రాంత గిరిజనులకు మంగళవారం నుంచి రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం వెళ్లాలన్నా రోడ్డు దుస్థితి కారణంగా. కనీసం ద్విచక్ర వాహనం రాలేని పరిస్థితి ఏర్పడిందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తక్షణం రోడ్డు గండిని పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పురవీధుల్లో పర్యటిస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని, ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను అతలాకుతలం చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. మండలంలోని టెక్కలిపట్నంలో మంగళవారం రాత్రి టిడిపి ఆధ్వర్యాన భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో పర్యటించి వైసిపి ప్రభుత్వం అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయని, మళ్లీ ఈ రాష్ట్రం బాగుపడాలన్నా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావాలన్నా చంద్రబాబునాయుడు లాంటి సమర్థుడైన నాయకుడిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మహానాడు వేదికగా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో లోడగల కామేశ్వరరావు, పిరికట్ల విఠల్‌రావు, దువ్వాడ సంతోష్ కుమార్, అవుగాన ధశరథ, అవుగాన షణ్ముఖరావు, రాజారావు, అప్పారావు, అధికారి, జయచంద్ర పాత్రో, కొర్ల విష్ణు, మాదవయ్య పాల్గొన్నారు.

నిర్మించిన ప్రహరీ

కంబాల చెరువు ఆక్రమణ

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి పంచాయతీలో ఉన్న కంబాల చెరువు ఆక్రమణకు గురైంది. ఈ చెరువు ఆయకట్టు కింద సుమారు 40 ఎకరాలు భూమిని రైతులు సాగు చేస్తున్నారు. అయితే కంబాలపేటకు చెందిన ఓ వ్యక్తి చెరువు గర్భాని ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నారు. చెరువు ఆక్రమణకు గురైతే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కొ వాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కంబాల చెరువు ఆక్రమణపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసు కెళ్లారు. అయినా ఆక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రాజాంలో పొందూరువాసుల మృతి



రవి (ఫైల్), నవ్య (ఫైల్)

ప్రజాశక్తి- పొందూరు

విజయనగరం జిల్లా రాజాం పట్టణం సమీపంలోని గాయత్రి కాలనీ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొందూరు పట్టణానికి చెందిన గెంబలి రవి (42), గెంబలి నవ్య (19)లు మృతి చెందారు. పట్టణానికి చెందిన గెంబలి రవి కిరాణా వ్యాపారం నిర్వహిస్తుంటాడు. రాఖీ పౌర్ణమి సమీపిస్తుండడంతో చీపురపల్లిలో రాఖీలు కొనేందుకు తన అన్న కూతురు నవ్యను తీసుకుని స్కూటీపై వెళ్లారు. రాఖీలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా లారీ ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతుడికి భార్య లావణ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అలాగే నవ్య ఇటీవల డిగ్రీ పూర్తి చేసింది. ఈమెకు తండ్రి సురేష్, తల్లి సరోజిని, తమ్ముడు ఉన్నారు. ప్రమాదం విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

విరివిగా మొక్కలు నాటాలి

పలాస: ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని ఇండస్ట్రీ ఏరియా జీడి పరిశ్రమ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు అన్నారు. కాశీబుగ్గ ఇండస్ట్రీ ఏరియాలో మంగళవారం జీడి పరిశ్రమలు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మల్లా శరత్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గోవిందరాజులు

ఒబిసి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాకు చెందిన పలు సామాజిక తరగతులకు చెందిన నాయకులు ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఢిల్లీలో మంగళవారం కలిశారు. కళింగ వైశ్య, సొండి, శిష్టకరణ, అరవల సామాజిక తరగతులకు చెందిన నాయకులు బోయిన గోవిందరాజులు, పి.వి.రమణ, డబ్బీరు శ్రీనివాస్, కిరణ్, రత్నాల కాశీ విశ్వనాథ చౌదరి, బెహరా రాజారావు తదితరులు ఢిల్లీలోని ఎంపీ కార్యాలయానికి వెళ్లి తమను ఒబిసి జాబితాలో చేర్చాలని కోరారు. అనంతరం వారు ఎంపీతో కలిసి ఢిల్లీలోని కేంద్ర వెనుకబడిన, సామాజిక అభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌ను పార్లమెంట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ల అంశాన్ని వివరంగా చర్చించారు. ఒబిసిలో చేర్చేందుకు తన శక్తి మేరకు కృషి చేస్తానని ఎంపీ వారికి హామీనిచ్చారు.

మాట్లాడుతున్న జెసి నవీన్

బాధిత రైతులకు న్యాయం చేస్తా

జాయింట్ కలెక్టర్ నవీన్

మెళియాపుట్టి : మెగా వాటరు పైపులైన్ బాధిత రైతులకు న్యాయం చేస్తామని జెసి ఎం.నవీన్ అన్నారు. మండలంలోని చాపర రైతులతో మంగళవారం మాట్లాడారు. తమ పొలాల మీదుగా మెగా వాటర్ సరఫరా పథకం పైపులైను ఏర్పాటు చేశారని, అందుకు సంబంధించిన నష్టపరిహారం అందలేదని రైతులు స్పందన్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జెసి పైపులైన్లను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఆర్ఐ వైకుంఠరావు, విఆర్‌ఒ హిమగిరి, పథకం సంబంధించి ఇంజినీర్లు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీతులసి

'ఫ్యామిలీ డాక్టర్' పరిశీలన

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మీతులసి సూచించారు. మండలంలోని ఈదులవలసలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య శిబిరానికి వచ్చే రోగుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బిపి, డయాబెటిస్ రోగుల వివరాలను ఆన్‌లైన్ చేస్తూ... ఫాలో ఆఫ్ చేయాలన్నారు. వైద్య శిబిరానికి రాలేని రోగుల ఇంటికి వెళ్లి గృహ సందర్శన చేయాలన్నారు. కార్యక్రమంలో పోలాకి పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీనాథ్, సుమ, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, డిడిఒ సుమతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నగదును అందజేస్తున్న సిబ్బంది

వైఎస్ఆర్ బీమా అందజేత

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లకు చెందిన పఠాన్ బాబ్జి ఇటీవల మృతి చెందారు. వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయం కింద సచివాలయం ఉద్యోగులు మృతుడు కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాడాన పుష్పలత, ఎంపిటిసి తుంగాన రవణమ్మ, కార్యదర్శి లక్ష్మణరేఖ, వెల్ఫేర్ అసిస్టెంట్ చాణిక్య, బత్తుల హేమలత, జగదీశ్వరి పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ఆందోళన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి రత్తకన్న రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 197/2 వివాదాస్పద స్థలం వద్ద టిడిపి నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. టిడిపి పట్టణ నాయకులు కాళ్ల ధర్మారావుకి ఇదే సర్వే నంబరులో రెండు ఎకరాల మెట్టు భూమి 30 ఏళ్ల నుంచి అతని అనుభవం స్వాధీనంలో ఉందని, అధికార పార్టీ ఒత్తిడి వల్ల దౌర్జన్యంగా తమ పార్టీకి చెందిన నేత భూమిని ఆక్రమణ పేరుతో తొలగించడం దారుణమని అన్నారు. అనంతరం ధర్మారావు విలేకరులతో మాట్లాడుతూ తన భూమి కి సంబంధించి హక్కు పత్రం, ప్రభుత్వానికి చెల్లిస్తున్న భూమి శిస్తు చెల్లిస్తున్నానని, దానికి సంబంధించిన రసీదులు ఉన్నాయని అన్నారు. 2021లో ప్రభుత్వం నవరత్నాలు పథకం కింద పేదలకు ఇళ్లు నిర్మించేందుకు అవసరమని చెబుతూ చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకున్నారని అన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆర్డర్ కూడా పొంది ఉన్నాయని అన్నారు. తన స్థలంలో రూ.లక్షలు వెచ్చించి కంచే వేసుకుంటే అధికార యంత్రాంగం దౌర్జన్యంగా తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, దక్కత ఢిల్లీరావు, బెందాళం రమేష్, మాదిన రామారావు, టి.తవిటయ్య, సాలీనా ఢిల్లీయాదవ్, మణిచంద్ర ప్రకాష్, కొండ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

మణిపూర్‌లో అల్లర్లను అరికట్టాలి

నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- పలాస

మణిపూర్ రాష్ట్రంలో కుక్కి, నాగ జాతికి చెందిన ఆదివాసీలపై దాడులను ఆ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అరికట్టాలని వామపక్ష నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, చాపర సుందర్‌లాల్, నెయ్యల గణపతి, మద్దిల వినోద్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సిపిఐ ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా ఆదివాసీలపైన జరుగుతున్న హత్యలు, హత్యాచారాలకు పాల్పడిన వ్యక్తులకు బహిరంగంగా ఉరి తీయాలన్నారు. మణిపూర్ మారణ హోమానికి దేశ ప్రధాని, హోంశాఖమంత్రి, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు సవర హరికృష్ణ, చాపర వేణుగోపాల్, తామడ సన్యాసిరావు, నాగేశ్వరరావు, గోరు వాసుదేవరావు పాల్గొన్నారు.

పర్యాటక క్లబ్‌లతో నూతన ఆవిష్కరణలు

జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

శ్రీకాకుళం : జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా పర్యాటక ప్రదేశాన్ని తీసుకొచ్చేందుకు, పిల్లలు నైపుణ్యం, పరిశుభ్రత, వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువ పర్యాటక క్లబ్‌లు దోహదపడతాయని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. నగరంలోని టిపిఎం స్కూల్‌లో యువక్లబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్, పర్యాటకశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ యువ క్లబ్‌లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. యువ పర్యాటక క్లబ్‌ల నుంచి నూతన ఆవిష్కరణలు కోరుతున్నామని అన్నారు. విద్యార్థుల సృజనాత్మక శక్తిని ఉపయోగించి ఈ దిగువ అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ పండగలు, జాతరలు, కళారుపాలపై భావితరాల వారికి తెలియజేయాలంటే యువత వాటిపై డాక్యూమెంట్ తీసి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. యువ క్లబ్‌ల వల్ల విద్యార్థులకు నైపుణ్యం పెంపొందుతుందన్నారు. డాక్టర్ గీతా శ్రీకాంత్ ముట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో వివిధ పర్యటిక ప్రదేశాలను పర్యటించి వీడియోగ్రఫీ చేసి, ఫొటోలు జతచేసి వాటి చరిత్రను తెలుసుకొని పలువురికి తెలియజేయాలన్నారు. జిల్లా పరిసర ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలను గుర్తించి వాటి చరిత్ర ఫొటోలను జతపరిచి డాక్యూమెంట్ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ పర్యాటక అధికారి డి.రమేష్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నీరజ, రోటరీ క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సత్యాగ్రహ దీక్షతో పాలకులకు కనువిప్పు

వజ్రపుకొత్తూరు: జీడి రైతుల సత్యాగ్రహ దీక్ష పాలకులకు కనువిప్పు కలగాలని ఎపి జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వంకులూరులో మెట్టూరు ఎంపిటిసి కొండప్ప సురేఖ చేతుల మీదుగా 24 గంటల జీడి రైతుల సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కాశీబుగ్గ బస్టాండ్ పరిధిలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సత్యగ్రహ దీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ సత్యాగ్రహ దీక్షా శిబిరాన్ని పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎన్.వి.ఎస్.శర్మ ప్రారంభిస్తారని అన్నారు. ఉద్దానం జీడి రైతాంగం ప్రజలు, ఇతర పంటల పండించే రైతులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు పలికి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి జీడి రైతులకు సరైన ధర ఇవ్వక వ్యాపారులు మోసం చేస్తున్నారని అన్నారు. కానీ, పాలకులు జీడి రైతులకు రక్షణ కల్పించలేదని విమర్శించారు. నాలుగేళ్లుగా జీడి పిక్కల ధర వంద శాతం దిగజారడంతో రైతులకు గిట్టుబాటు రావడం లేదని అన్నారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడే హీనస్థితికి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ప్రభుత్వ హత్యలనని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా జీడి పంటను గుర్తించి పంటల జాబితాలో చేరిపించాలన్నారు. 80 కిలోల జీడి పిక్కల బస్తకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న జీడి రైతు సైని సింహాచలం కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బురదమయమైన రోడ్డు

చినుకు పడితే చిత్తడే

ప్రజాశక్తి- పొందూరు

చిన్నపాటి వర్షం కురుస్తే చాలు దమ్ము మడులను తలపిస్తూ బురదమయమైన రహదారులపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని తుంగపేట 70 ఇళ్లు ఉండగా, 200 మంది వరకూ జీవిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి ఇరువైపులా కాలువలను నిర్మించారు. ఇంతలో ఈ నిర్మాణాలపై అప్పట్లో పలువురు కోర్టును ఆశ్రయించడంతో రోడ్డు నిర్మాణాలు నిలిచిపోయాయి. ఆరేళ్లుగా రహదారి నిర్మాణం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటా కుళాయిలు వేసేందుకు రహదారికి ఇరువైపులా గోతులు తవ్వారు. ఈ గోతుల్లో పైపులు వేసి మట్టిని తిరిగి కప్పివేయగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి అంతటా బురదమయమై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పుండు మీద కారం చల్లినట్లుగా అయింది మా పరిస్థితి అంటూ కాలనీ వాసులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై రాకపోకలు సాగించే సమయంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నామంటూ వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి కాలనీలో సిసి రహదారుల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న హమాలీలు

కళాసీల షెడ్ తొలగింపు సరికాదు

మందస : బస్సు స్టాండ్ నిర్మాణం పేరుతో 60 ఏళ్లుగా ఉపాధి పొందుతున్న హమాలీల షెడ్ తొలగించడం సరికాదని హమాలీలు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై మంత్రి అప్పలరాజు, మందస సర్పంచ్‌లను మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందజేవారు. కళాసీల షెడ్డుకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి పంచాయతీ పరిధిలో ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ధర్మారావు, దేవేంద్ర, అప్పలస్వామి, కృష్ణారావు, వల్లభరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

కోటబొమ్మాళి : మండల రైతులకు డిఎపి, యూరియా స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఖరీపు సీజన్‌లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న సందర్భంగా సబ్సిడీపై యురియా, డిఎపి అందుబాటులో ఉన్నాయని అన్నారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, 1బి జిరాక్స్‌లు తీసుకుని రావాలని కోరారు.

వరుసక్రమంలో వరినాట్లు

ఆమదాలవలస : పంట పొలంలో వరుస క్రమంలో వరినాట్లు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల రైతులతో లైన్ షోయింగ్ పద్ధతుల ఉబాలను మంగళవారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యాన రైతుల చేత వరి పంట లైన్ షోయింగ్ పద్ధతిలో నాట్లు వేయించామని తెలిపారు. ఈ విధంగా వరుస క్రమంలో వరి పంటలో నాట్లు వేసుకోవడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి మంచి దుబ్బులు వస్తాయని అన్నారు. పంటకు ప్రధానం గా దోమపోటు సోకకుండా ఉంటుందని తెలిపారు. మంచిపంట దిగుబడులను పొందవచ్చునన్నారు. వరి పంటలో తప్పకుండా రాజీలేని సూత్రాలను పాటించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుప తిరావు, లక్ష్మి, జానకిరామ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

క్రమపద్ధతిలో నాట్లు వేస్తున్న కూలీలు

సన్యాసిరావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

అవార్డు అందుకుంటున్న సన్యాసిరావు

బూర్జ : మండలంలోని పెద్దపేట ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావుకు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. విజయవాడలోని మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ 42వ నాబార్డు ఫౌండేషన్ డే మంగళవారం నిర్వహించారు. ఐఎఫ్ఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి, నాబార్డు రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్ చేతుల మీదుగా ఉత్తమ రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అవార్డును అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సన్యాసిరావుకు అభినందనలు తెలియజేస్తూ... ఆయన చేసిన సేవలను కొనియాడారు. అవార్డు గ్రహీత సన్యాసిరావు మాట్లాడుతూ మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ 2017లో ప్రారంభించి 151 మంది రైతుల వాటాదారులతో నడుస్తుందని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో 70 గ్రామాల్లో పనిచేసి ఇప్పటి వరకు రూ.3 కోట్ల వ్యాపారాన్ని చేశామన్నారు. ఈ అవార్డు ఎంపిక కారడానికి సహకరించిన శ్రీకాకుళం నాబార్డు కుప్పిలి వరప్రసాద్, పార్వతీపురం మన్యం జిల్లా డిడిఎం టి.నాగార్జునలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శంకరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న సత్యనారాయణ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి, వార్డు సచివాలయ ఆరోగ్య, పారిశుధ్య కార్యదర్శులకు, ఆశా కార్యకర్తలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల ద్వారా సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం మనపై ఎంతైనా ఉన్నదన్నారు. దోమల నివారణకు ముందస్తు చర్యలపై ఇంటింటా అవగాహన కల్పించాలన్నారు. కమిషనర్ ఎం.రవిసుధాకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సెప్టిక్ ట్యాంకు పైపులకు తప్పనిసరిగా మెస్‌లను బిగించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు, సలహాదారు ఎల్.కిషోర్, ఉప విభాగ అధికారి కె.ఎస్.అప్పారావు, మెట్టక్కివలస, మోనింగివారివీధి పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు జి.సాయికిరణ్, ఎస్.శాంతిప్రియదర్శిని పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

సచివాలయాలతో ప్రజల చెంతకు పాలన

ప్రజాశక్తి- జలుమూరు

సచివాలయాలు ఏర్పాటు ద్వారా ప్రజల చెంతకు పాలన వచ్చిందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని పాగోడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామంలోనే పనులు జరుగుతున్నాయని అన్నారు. ముందుగా వెలుసోద, పోగోడు గ్రామాల్లో చేపట్టనున్న ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల వైసిపి కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, సర్పంచ్ దామ మన్మథరావు, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షుడు పాగోటి రాజప్పలనాయుడు, ఎంపిటిసి రావాడ చందనబాబు, మండల ఇంజినీర్ కె.శ్రీధర్ పాల్గొన్నారు.

'ప్రశస్త' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

ఎన్‌సిఇఆర్‌టి 21 రకాల వైకల్యాలు ఉన్న విద్యార్థులను గుర్తించడానికి ప్రత్యేకంగా 63 అంశాలతో కూడిన 'ప్రశస్త' యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని జిల్లా సర్వశిక్షా అభియాన్ సహిత విద్య (ఐఇ) కో-ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు అన్నారు. మండలంలోని కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిడబ్ల్యూఎన్ సర్వే ఫలితాలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ యాప్‌ను పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అంగవైకల్యం గల విద్యార్థులను గుర్తించడం భారంగా కాకుండా బాధ్యతగా ఉపాధ్యాయులు భావించాలని పేర్కొన్నారు. మండలంలో ఎక్కువ మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో ఐఇఆర్‌టిలు దినేష్, రాధారాణిలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సహిత విద్య కో-ఆర్డినేటర్ ఎస్.అనూరాధ, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వయం శక్తి సంఘాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని వైఎస్ఆర్ క్రాంతి పథ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. మండలంలోని నెల్లిపర్తి సచివాలయంలో పంచసూత్రాలు పాటిస్తున్న స్వయం శక్తి సంఘాల రికార్డులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాలు, సంగ్రహ పట్టికలను సభ్యులందరికీ అర్థమయ్యేటట్లు రాసుకోవాలన్నారు. గ్రామ సంఘాల ద్వారా ఎలాంటి ప్రాసెసింగ్ ఛార్జీలు గాని, ఇన్స్పెక్షన్ ఛార్జీలు గాని, డాక్యుమెంటేషన్, మెయింటెనెన్స్ ఛార్జీలు వసూలు చేయకుండా తక్కువ వడ్డీకే మంజూరు చేస్తున్న స్త్రీనిధి జీవనోపాధి రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. అప్పు తీసుకున్న సభ్యులు మృతి చెందితే ఆ అప్పు భారం వారి కుటుంబానికి గాని, సంఘానికి గాని, స్త్రీనిధి బకాయి ఉన్న అప్పునకు ఇన్స్యూరెన్స్ వర్తిస్తుందని వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, విఒఎ భారతి పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కూర్మారావు

సమన్వయంతోనే మండల అభివృద్ధి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

నాయకులు, అధికారులు సమన్వయంతోనే మండలం అభివృద్ధి చెందుతుందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయా సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు వారం రోజుల్లో ప్రారంభానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ఎందుకు స్పందించడం లేదని విద్యుత్‌శాఖ ఎఇ గోవిందరాజును ఆమెతో పాటు ఎంపిపి, ఎంపిటిసిలు నిలదీశారు. జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని మాజీ ఎంపిపి ఏకాంబరీదేవి కోరారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు.

ఈదుపురంలో జగనన్న కాలనీలో ఎత్తు పెంచాలని సర్పంచ్ నర్తు ప్రసాద్ కోరారు. భూ మట్టం మూడు అడుగులు పెంచడం వల్ల లబ్ధిదారులకు కష్టమవుతుందని, దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని విజయ తెలిపారు. కేదారిపురం, బూర్జపాడు, డొంకూరు జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం లేక ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేకపోతున్నారని అన్నారు. ఈ విషయంపై విజయ మాట్లాడుతూ జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం తక్షణమే అందించాలని, మండలంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తెలియజేస్తే పరిష్కరిస్తారని అన్నారు. ఈ ఏడాది రైతులు పండించే పంటలు సంబంధించి ఈ-క్రాప్ సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు ప్రారంభం కాని పక్షంలో వాటిని రద్దు చేస్తే... మరలా నిధులు మంజూరు చేస్తామని అన్నారు. బూర్జపాడు వంతెన నిర్మాణానికి రూ.6.3 కోట్లు, కాజ్‌వే ఉన్నచోట వంత నిర్మాణానికి రూ.10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిడిఒ ఈశ్వరరావు, డిటి గురుప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ సంతోష్, మండల ఎఒ భార్గవ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: మాట్లాడుతున్న ఆర్‌డిఒ శాంతి

బిఎల్‌ఒలకు సహకరించాలి

ఆమదాలవలస : ఇంటింటి సర్వేలో బిఎల్‌ఒలకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని ఆర్‌డిఒ బి.శాంతి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ప్రారంభమైన ఇంటింటా సర్వేను బిఎల్‌ఒలతో పారదర్శకంగా చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, వారి బూత్ లెవెల్ ఏజెంట్లతో కలిసి పాల్గొని సహకరించాలని కోరారు. మృతి చెందిన వ్యక్తుల ఓట్లను, శాశ్వతంగా వేరే ప్రాంతానికి వలస వెళ్లిన వారి ఓట్లను జాబితా నుంచి ఫారం నంబరు సెవెన్‌ను దరఖాస్తు చేసుకుని తొలగించాలని కోరారు. సమావేశంలో టిడిపి నుంచి బి.వి.రమణమూర్తి, వైసిపి నుంచి తమ్మినేని వెంకట చిరంజీవినాగ్, కాంగ్రెస్ నుంచి బి.షణ్ముఖరావు, బిజెపి నుంచి సాధు కిరణ్ కుమార్, చింతాడ అప్పారావు, సిపిఐ నుంచి పేడాడ ధనుంజయరావు, ఆమదాలవలస, బూర్జ తహశీల్దార్లు ఎస్.గణపతిరావు, ఎస్.రమణారావు, ఎన్నికల డిటి మురళీధర్ నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రస్తుతం చేపడుతున్న ఓటర్ల సర్వేను అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎన్నికల నిర్వహణాధికారి మురళీకృష్ణ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల పరిశీలన ప్రక్రియ సజావుగా సాగాలని, దీనికి అన్ని పార్టీలూ మద్దతు నివ్వాలని కోరారు. ఓటర్ లిస్టులో ఎటువంటి అవకతవకలు ఉన్నా బిఎల్‌ఒల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, గొర్లె శ్రీహరి, మన్నె సురేష్‌కుమార్, బెండు మల్లేశ్వరరావు, మండపాక కనకారావు, వావిలపల్లి రామకృష్ణ, మజ్జి రమేష్, పిసిని జగన్నాథనాయుడు, రౌతు శ్రీనివాసరావు, మైలపల్లి పోలీస్, కొత్తకోట్ల సింహాద్రినాయుడు, తహశీల్దార్లు సనపల కిరణ్‌కుమార్, పి.వేణుగోపాలరావు, దిలిప్‌చక్రవర్తి, టి.సత్యనారాయణ, జి.కె.శ్రీనివాసరావు, డిటిలు పాల్గొన్నారు.

గణితంపై భయాన్ని తొలగించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని ఉపాధ్యాయులు తొలగించాలని ఎంఇఒ జి.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు గొల్లపల్లి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన గణితం సబ్జెక్టు కాంప్లెక్స్‌లో మంగళవారం పాల్గొని మాట్లాడారు. గణితంపై విద్యార్థుల్లో మక్కువ పెరిగేలా ఆసక్తి కరమైన బోధన నైపుణ్యాలు ఉపయోగించాలని సూచించారు. బోధన అభ్యసన సామగ్రి సమర్థంగా వినియోగించాలన్నారు. సీనియర్ గణిత ఉపాధ్యాయులు జి.గోపాలకృష్ణ తొమ్మిదో తరగతి విద్యార్థులకు బీజ గణితాన్ని రేఖా గణితంతో అనుసంధానం చేసి నిరూపించడం అనే అంశాన్ని ఉదాహరణలతో పాఠ్య భోదన చేశారు. మండల గణిత సెక్రటరీ చింత ఉమారావు గణితాన్ని మెలకువల సహాయంతో ఆసక్తిని కలిగించేటట్లు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్.సురేష్, దిలీప్‌సాహు, సోమేశ్వరరావు, కిరణ్, శంకరరావు, అన్నపూర్ణ, శోభారాణి, సిఆర్‌పి కృష్ణారావు పాల్గొన్నారు.

నందిగాం: ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఫలితాలను ఇస్తాయని డివిజన్ విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్‌ను మంగళవారం పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.నరసింహులు, ఎ.చిన్నారావు, సిఆర్‌పిలు, కాంప్లెక్స్ చైర్మన్ యర్నాగుల హరిబాబు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ఎంఇఒ రమణమూర్తి

చేపల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాట్లాడుతున్న బాలకృష్ణ

గిరిజన ప్రాంతాలోని అనేక నీటి వనరులను ఉపయోగించుకొని చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఔత్సాహిక గిరిజన రైతులకు మంగళవారం చేపల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి వనరుల్లో చేప పిల్లలను విడుదల చేసే సమయం నుంచి పట్టుబడి చేసేంతవరకు శాస్త్రీయ యాజమాన్య విధానాలను పాటించాలన్నారు. దీంతో చేపల ఆరోగ్యం పెరుగుదల బాగా ఉండి అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. చేపల పెంపకాన్ని ఒక ఉపాధి మార్గంగా ఎంచుకునే అవకాశం గిరిజన యువతకు ఉందని అన్నారు. మొదటిరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా చేపల పెంపకంలో శాస్త్రీయ విధానాలైన చేపల చెరువుల తయారీ, చేప పిల్లల సాంద్రత, సున్నం ఎరువుల యాజమాన్యం, మేత యాజమాన్యం తదితర విషయాలను వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ ఉత్పత్తులు తయారు చేసుకునే వీలున్నందున ఉపాధి అవకాశంగా ఎంచుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



పైనాపిల్ జామ్ తయారీలో శిక్షణ ఇస్తున్న సునీత

కొనసాగుతున్న వృత్తి శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై రెండో రోజు శిక్షణా కార్యక్రమాన్ని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి. సునీత ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైనాపిల్ మంచి వాసనతో పాటు రుచి కలిగి ఎన్నో పోషక విలువలను కలిగి ఉంటుందని తెలిపారు. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల వ్యాధుల నుంచి రక్షించడంలో తోడ్పడుతుందని పేర్కొన్నారు. దీనిలోని విటమిన్ సి, పీచు పదార్థం ఎముకలకు దృఢత్వాన్ని పెంచే పొటాషియం ఉంటుందన్నారు. పైనాపిల్ పండు నుంచే గాక వీటి ఆకుల నుంచి నాణ్యమైన నారను పండు పై భాగంలో ఉండే తొక్క నుంచి బ్రోమిలిన్ అనే ఎంజైమ్‌ను తీస్తారని వివరించారు. అనంతరం పైనాపిల్ జామ్ క్యాండీలను తయారు చేయడంలో శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న తిలక్

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

టెక్కలి : కోటబొమ్మాళి మండలంలో కళింగ సామాజిక భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలపేట పోర్టు స్థాపనకు వచ్చిన సిఎం జగన్‌ను కలిసి వినతిపత్రం అందించామని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన స్థలం కేటాయింపుకు అనువైన స్థలం కోసం బిసి సంక్షేమశాఖ నుంచి వచ్చిన ఆదేశాలను సబ్ కలెక్టర్‌కు చూపించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ త్వరితగతిన స్థలం చూస్తామని తెలిపారు. ఈయనతో పాటు డైరెక్టర్ హేమసుందర్‌రాజు తదితరులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

సీతంపేట : మండలంలోని చిన్నపల్లంకి, మిన్నకోట, పుబ్బాడ మంగళవారం మలేరియా సబ్‌యూనిట్ అధికారి మోహన్‌రావు స్ప్రేయింగ్ చేశారు. దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్ వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం మలేరియా డెంగీ నివారణ మహోత్సవాలు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా రక్తపూతలు సేకరించారు. జ్వరాలపై సర్వే నిర్వహించారు.

కలుపు నివారణతో లాభాలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో కొండములగాం, వేల్పురాయి, తెప్పలవలస పంచాయతీల్లో పలు గ్రామాల్లో అజోల్లా మదర్ పిట్స్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కృష్ణ మాట్లాడుతూ ఈ అజోల్లా ఖరీఫ్‌లో వరి పొలంలో వరి నాటిన వారం రోజుల్లో ఒక ఎకరానికి 5 కేజీలు అజోల్లా చల్లడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. పంట కూడా వేపుగా పెరుగుతుందని, వాతావరణంలోని నత్రజని గ్రహించి నేలలో స్థిరీకరణ చేస్తుందని అన్నారు. ఇలా చేయడం వల్ల రసాయన ఎరువు, యూరియా వాడకం తగ్గించవచ్చునన్నారు. వరి పొలం నీరు లేకపోయినా 15 రోజులు వరకు తేమను పట్టి ఉంటుందన్నారు. పశువులు, కోళ్లు మేతగా కూడా ఉపయోగించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాంబాబు, సంతోషికుమారి, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : అజోల్ల (నాచు మొక్క) వల్ల వరి పంటలో కలుపు నివారణతో రైతులకు లాభాలు చేకూరుతుందని యూనిట్ ఆన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు అన్నారు. మండలంలోని రావాడలో సామూహికంగా అజోల్ల పిట్‌పై రైతులకు అవగాహన కల్పించారు. వరి నాటుకుని 20 రోజుల తర్వాత అజల్లా అనేది వేసుకోవాలన్నారు. దాని వల్ల లాభాలు భూముల నత్రజని అందుతుందని, కలుపు నివారణ, తేమ శాతం ఉంటుందని అన్నారు. రైతుకు యూరియా, డిఎపి వేయాల్సిన అవసరం ఉండదన్నారు. కోళ్ల మేతగా కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. ఐసిఆర్‌పి రమణమ్మ, సూర్యం, వాలంటీర్ సుజాత పాల్గొన్నారు.

తయారు చేస్తున్న సిబ్బంది

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

పారిశుధ్య నిర్వహణ సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, ప్రతి వార్డులోనూ బ్లీచింగ్ పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి శానిటేషన్ సెక్రటరీలకు, మేస్త్రీలకు సూచించారు. కౌన్సెల్ సమావేశం మందిరంలో పారిశుధ్య విభాగానికి సంబంధించి శానిటేషన్ సెక్రటరీస్, శానిటరీ మేస్త్రీలతో కమిషనర్ రమేష్ అధ్యక్షతన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీరు ఒకే దగ్గర నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ పనులకు సంబంధించి ఒక్కో శానిటరీ సెక్రటరీల నుంచి వివరాలు సేకరించారు. రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నామని, కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో రోడ్లు, డ్రెయినేజీల పక్కన పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని, వారం వారం పిచ్చి మొక్కలను వాలంటీర్ల సహకారంతో తొలగించాలని అన్నారు.

పరామర్శిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

కొత్తూరు : మండలంలోని నివగాంకు చెందిన బూరాడ రామజోగులు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు మంగళవారం పరామర్శించారు. అలాగే డాక్టర్ బోడసింగి తిరుపతిరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మదనాపురానికి చెందిన గల్లంకి గోపాలరావు ఇటీవల పిడుగుపడి మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులనూ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

పారసాంబను అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పారసాంబలో ఉన్న సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పారసాంబను కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. గ్రామానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటుకు నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రెయినేజీలు, రోడ్డు మరమ్మతులు, ముత్యాల పోలమ్మ ఆలయ రోడ్డుకు గడపగడపకు నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు చేపడతామని చెప్పారు. ఈయనతో పాటు డిఇఇ బల్ల హరి, ఎఇఇ అవినాష్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల ఆందోళన

వీరఘట్టం: మండలంలోని ఆడారు పంచాయతీ డిపివలసకు చెందిన పలువురు రైతులు తమ న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు రైతులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామంలో 300 ఎకరాల మెట్టు భూమి ఉందని, తాతల దగ్గర్నుంచి వారసత్వంగా పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు. తమకు ఒకే నెంబర్ గల ప్రభుత్వ భూమి అని, డి-పట్టా భూమి అని, ఈ సమస్య అడంగల్‌లో వస్తుందని, భూమికి సంబంధించి ప్రతి ఏటా పన్నులు కడుతున్నామని, రెవెన్యూ వారిచ్చిన పాస్ పుస్తకాల ప్రకారం తమ భూములు తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

రూ 20.45 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో రూ.20.5 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని విద్యుత్ స్తంభాల ఏర్పాటు, స్మశాన వాటిక, సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు సంబంధించి గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పిపి ఈతమానుగూడ పంచాయితీ, కె.గుమడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో రసాయనిక మందులు, పురుగు మందులు వల్ల నష్టాలు, పెట్టుబడులు ఎక్కువ, దిగుబడి తక్కువ, చిరు ధాన్యాలు ఉపయోగాలు, మానవుడి ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవ రావు, ప్రోగామ్ కో ఆర్డినేటర్ హరిశ, పిపి ఈతమానుగూడ సర్పంచ్ ప్రతినిధి బి. మన్మథ రావు, వెలుగు సిబ్బంది.